క్లుప్తంగా

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



బుర్రకథ వినిపిస్తున్న కళాకారులు

శ్రీశైలంటెంపుల్: దసరా మహోత్సవాలను పురస్కరించుకుని ఆలయ దక్షిణ మాఢవీదిలోని నిత్యకళావేదికపై నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. శుక్రవారం సికింద్రాబాద్‌కు చెందిన టి.ఎ.వి శాలాక్షి, బృందం గాత్ర కచేరి, అలాగే రాజమండ్రికి చెందిన విభూది లోవరాజు, బృందం పార్వతీకల్యాణాన్ని బుర్రకథ రూపంలో వినిపించారు.

మొక్కజొన్న పంట పరిశీలన



మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

నందికొట్కూరు: మొక్కజొన్న పంటలో కంకులకు విత్తనం రాకపోవడంపై కౌలు రైతులు పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో శాస్త్రవేత్తలు కవిత, మల్లేశ్వరరెడ్డి, పర్వీన్ శుక్రవారం మొక్కజొన్న కంకులను పరిశీలించారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ.. నకిలీ విత్తనాల వాడకమే పంట దెబ్బతినడానికి కారణమని తేల్చి చెప్పారు. కంకుల్లో ఒక్క విత్తనం కూడా కనిపించడం లేదని స్పష్టంచేశారు. ఈ అంశంపై పూర్తి నివేదిక సిద్ధం చేసి జిల్లా అధికారులకు అందజేస్తామని శాస్త్రవేత్తలు తెలిపారు. వీరి వెంట రైతు సంఘం నాయకులు, వ్యవసాయ అధికారులు ఉన్నారు.

గాయపడిన మహిళ మృతి

జూపాడుబంగ్లా: మండల కేంద్రంలోని తంగెడంచ చెక్‌పోస్ట్ వద్ద ఈనెల 24న ఆటో, తూఫాన్ వాహనం ఢీకొన్న ప్రమాదంలో గాయపడిన తాటిపాడుకు చెందిన ఉసేన్ బీ(65) చికిత్సపొందుతూ శుక్రవారం మృతి చెందింది. మృతురాలి కొడుకు ఇద్దూర్‌బాషా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించినట్లు ఎస్ఐ మల్లికార్జున తెలిపారు. గాయపడిన వారిలో కొంత మంది కర్నూలు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్సపొందుతుండగా మరికొందరు కోలుకోవడంతో ఇళ్లకు వెళ్లినట్లు ఎస్ఐ తెలిపారు.

గిరిజనుల అభివృద్ధికి కేంద్రం కృషి



గిరిజనులకు చీరలు పంపిణీ చేస్తున్న దృశ్యం

మహానంది: గిరిజనుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని బీజేపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు తెలిపారు. మోదీ జన్మదిన సేవా పక్షోత్సవాల సందర్భంగా ఆత్మకూరు పట్టణానికి చెందిన బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యురాలు మోమిన్ షబానా మహానంది సమీపంలోని చెంచులక్ష్మి గిరిజన గూడెంలో 50 కుటుంబాల గిరిజన మహిళలకు చీరలు పంపిణీ చేశారు. అంతకు ముందు వారు మహానందీశ్వరస్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో స్వచ్ఛత కార్యక్రమం చేపట్టారు. ఆ పార్టీ మండల అధ్యక్షుడు కిరణ్‌కుమార్ గౌడ్ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో మహిళకు అస్వస్థత



అస్వస్థతకు గురైన వెంకటలక్ష్మమ్మ

జూపాడుబంగ్లా: మండలంలోని తాటిపాడు గ్రామానికి చెందిన మంగలి వెంకటలక్ష్మమ్మ శుక్రవారం విద్యుదాఘాతానికి గురై గాయపడింది. బాత్‌రూమ్ తలుపు తెరవబోయిన సమయంలో గడియకి విద్యుత్ సరఫరా ఉండడంతో షార్ట్‌సర్క్యూట్ జరిగి ఆమెకు షాక్ తగిలింది. చుట్టుపక్కల వారు ఆమెను చీర పట్టుకుని వెంటనే పక్కకు లాగడంతో ప్రాణాపాయం నుంచి తృటిలో తప్పించుకుంది. తీవ్ర అస్వస్థతకు గురైన ఆమెను బంధువులు నందికొట్కూరు ఆస్పత్రికి తరలించారు.

నందమూరినగర్‌లో నాలుగు బైక్‌లు దహనం

నంద్యాల(అర్బన్): పట్టణ శివారులోని నందమూరినగర్‌లో గురువారం అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు నాలుగు బైక్‌లను దహనం చేసినట్లు రూరల్ సీఐ ఈశ్వరయ్య శుక్రవారం తెలిపారు. ఒకే చోట ఉంచిన నాలుగు బైక్‌లను పెట్రోల్ పోసి దగ్ధం చేశారన్నారు. బాధితుడు తిరుమలరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా నందమూరినగర్‌లో పోలీసు ఔట్ పోస్టు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

భారీ వర్షం

- పొంగి ప్రవహిస్తున్న వాగులు, వంకలు
- అలుగు ఎక్కి పారుతున్న సిద్ధాపురం చెరువు
- ఉదయం నుంచి సాయంత్రం లోపు 56 మి.మీ. వర్షపాతం నమోదు



పొంగి ప్రవహిస్తున్న భవనాశి



తిమ్మాపురంలో కురుస్తున్న వర్షం



గువ్వలకుంట్ల ఎస్సీకాలనీలో నిలిచిన నీటిని చూపుతున్న కాలనీవాసులు



మొక్కజొన్న పొలాల్లో నిలిచిన వర్షపునీరు

ఆత్మకూరు: పట్టణం, మండలంలో భారీ వర్షం కురిసింది. శుక్రవారం వేకువజామున 5 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎడతెరిపి లేకుండా రికార్డు స్థాయిలో వర్షం కురిసింది. ఉదయం మండలంలో 18.4 మి.మీ. వర్షం కురవగా, మధ్యాహ్నం 12 గంటలకు 30 మి.మీ. వర్షపాతం, సాయంత్రం 26.4 మి.మీ.వర్షపాతం నమోదైంది. మొత్తం ఉదయం నుంచి సాయంత్రం వరకు రికార్డుస్థాయిలో 56 మి.మీ. వర్షం కురవడంతో మళ్లీ రికార్డు స్థాయిలో భవనాశి, సుద్దవాగులు పొంగి ప్రవహించాయి. వరదరాజస్వామి ప్రాజెక్టుకు నిండుకుండలా మారింది. అలాగే..సిద్ధాపురం చెరువు అలుగు ఎక్కి కర్నూలు-గుంటూరు రహదారి వెంట ప్రవహించడంతో శ్రీశైలం, కర్నూలు, విజయవాడ, విశాఖపట్నం వెళ్లే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అతి భారీ వర్షాలు కురవడంతో మొక్కజొన్న, పత్తి రైతులు ఆందోళన చెందుతున్నారు. మొక్కజొన్న పంట ఈనెల చివరి వారం నుంచి కోతకు వస్తుందని, ఈ సమయంలో పొలాల్లో నీరు నిల్వ చేరుతుండటంతో పంట నేలవాలే అవకాశముందని రైతులు చెబుతున్నారు. ఇక మినుము పంట నీటిలో మునిగిపోయింది.

- **శ్రీశైలంటెంపుల్:** అల్పపీడన ప్రభావంతో శ్రీశైలంలో భారీ వర్షం కురిసింది. తెల్లవారుజాము నుంచి మండల పరిధిలో ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. భారీ వర్షం కారణంగా క్షేత్రానికి విచ్చేసిన భక్తులు ఇబ్బందులు పడ్డారు. స్వామి,అమ్మవార్లను దర్శించుకున్న అనంతరం భక్తులు వసతి గదులకే పరిమితమయ్యారు.
- **మహానంది:** మండలంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు మోస్తరు వర్షం కురిసింది. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షంతో జనం అవస్థలు పడ్డారు. పంట పొలాల్లో మొక్కజొన్న దిగుబడిని ఆరబెట్టుకున్న రైతులు వాటిని కాపాడుకునేందుకు కష్టపడాల్సి వచ్చింది. భక్తులు వర్షంలోనే మహానంది ఆలయానికి చేరుకుని శ్రీ కామేశ్వరీదేవి, శ్రీ మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకున్నారు.

పగిద్యాలలో 36.4 మి.మీ.వర్షపాతం

పగిద్యాల: మండలవ్యాప్తంగా ఎడతెరిపి లేని వర్షం కురుస్తోంది. శుక్రవారం ఒక్కరోజే 36.4 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో వర్షాలు కురుస్తున్నాయని పేర్కొన్నారు. చలిగాలుల తీవ్రత అధికంగా ఉండడంతో ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. వర్షాల ప్రభావంతో మొక్కజొన్న పంటలు దెబ్బతినే అవకాశం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



లింగాపురం, శివపురం గ్రామాల మధ్య ఉధృతంగా ప్రహిస్తున్న ఎద్దులేరు వాగు



నందికుంటలో రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

పాములపాడులో 11 మి.మీ

పాములపాడు: మండలంలో శుక్రవారం 11 మి.మీ వర్షపాతం నమోదైనట్లు ఏఎస్ఓ తేజస్వి తెలిపారు. మండలంలోని వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ప్రధానంగా ఇస్కాల గ్రామ సమీపంలోని భవనాసి నది ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. నది ఒడ్డున ఉన్న నందీశ్వరాలయం నీటిలో మునిగిపోయింది.

ముంచిన వాన



కొత్తపల్లి తాండవమల్లేశ్వరస్వామి ఆలయంలోకి చేరిన వర్షపునీరు

కొత్తపల్లి: మండల వ్యాప్తంగా శుక్రవారం కురిసిన భారీ వర్షాలతో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. ఖరీఫ్ సీజన్‌లో వేసిన మొక్కజొన్న, వరి పంటల్లోకి వర్షపు నీరు చేరి పంటలు దెబ్బతింటున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షపునీటి కారణంగా గ్రామాల రోడ్లు, కాలనీలు జలమయం అయ్యాయి. కొందరి ఇళ్లలోకి కూడా నీరు చేరి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గువ్వలకుంట్ల ఎస్సీ కాలనీ రోడ్లు వాగుల్లా మారిపోయాయి. డ్రైనేజీలు లేకపోవడంతో నీరు ఎటూ పోలేక కాలనీ మొత్తం జలమయమైందని జయమ్మ, మునెమ్మ, మోహన్‌రాజు, రాజు, ప్రశాంత్‌లు ఆవేదన వ్యక్తం చేశారు. నందికుంట గ్రామం వద్ద రోడ్డు పూర్తిగా దెబ్బతినగా, రోడ్డుపై మోకాలిలోతు నీరు నిలిచిపోయింది. కొత్తపల్లిలోనూ ఇదే పరిస్థితి కనిపించింది. తాండవ మల్లేశ్వరస్వామి గర్భాలయంలోకి నీరు చేరి శివలింగం మునిగిపోయింది. బావాపురం, వీరాపురం గ్రామాల్లో రహదారులపై నీరు ప్రవహిస్తోంది. ఎం.లింగాపురం-శివపురం గ్రామాల మధ్య ఎద్దులేరు వాగు ఉధృతంగా ప్రవహించడంతో దాదాపు 12 గ్రామాలకు మండల కేంద్రంతో రాకపోకలు నిలిచిపోయాయి.



జూపాడుబంగ్లాలోని కర్నూలు-గుంటూరు రహదారిపై ప్రవహిస్తున్న వర్షపు నీరు



జూపాడుబంగ్లా పోలీస్‌స్టేషన్ ప్రాంగణం

దంచికొట్టిన వర్షం

జూపాడుబంగ్లా: మండలంలో శుక్రవారం ఎడతెరిపిలేని వర్షానికి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ముఖ్యంగా పంటలు భారీగా నష్టపోయాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జూపాడుబంగ్లా, కొత్తపల్లి మండలాల్లో-26.8 మిల్లీమీటర్లు, నందికొట్కూరు-18.4 మి.మీ, పగిడ్యాలలో అత్యధికంగా 36.4 మి.మీ, మిడ్తూరులో కనిష్ఠంగా 10.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. జూపాడుబంగ్లాలో డ్రైనేజీ లేకపోవడంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. ముఖ్యంగా కర్నూలు-గుంటూరు ప్రధాన రహదారి, బొడ్డురాయి వీధి, సంతమార్కెట్ వీధి, పింజరిపేట, బీసీ కాలనీల్లో పరిస్థితి దారుణంగా మారింది. తహసీల్దార్, పోలీస్‌స్టేషన్ ఆవరణల్లో వర్షపు నీరు చేరింది. తంగడంచ, తరిగోపుల, పారుమంచ గ్రామాల్లో కూడా డ్రైనేజీ లేకపోవడంతో రహదారులపై నీరు ప్రవహిస్తోంది.

పేద ఖైదీలకు ఉచిత న్యాయ సహాయం



ఖైదీల సమస్యలు తెలుసుకుంటున్న జడ్జి శోభారాణి

నందికొట్కూరు: ఆర్థిక స్థోమత లేని ముద్దాయిలకు ఉచిత న్యాయవాదిని ఏర్పాటు చేస్తామని మండల న్యాయ సేవా సంఘం అధ్యక్షుడు, సీనియర్ సివిల్ జడ్జి ఎ. శోభారాణి తెలిపారు. శుక్రవారం పట్టణంలోని సబ్‌జైల్‌ను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముద్దాయిల సమస్యలను తెలుసుకున్నారు. పరిసరాలను పరిశీలించారు. జైలులోని లీగల్ ఎయిడ్ క్లినిక్‌లో ఉన్న న్యాయవాదుల ద్వారా న్యాయసహాయం పొందాలని సూచించారు. ఆన్‌లైన్ నంబర్ 15100 ద్వారా కూడా సమస్యలను తెలియజేయవచ్చని వివరించారు. అనంతరం 70 ఏళ్లకు పైబడిన ముద్దాయిల వివరాలను సేకరించారు. జైల్ సూపరింటెండెంట్ రఘునాథరెడ్డి, జైలు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

నూనె పదార్థాలు ఎక్కువ తీసుకోవద్దు

నందికొట్కూరు: ఆయిల్ పదార్థాలు ఎక్కువగా తీసుకోవడం వల్ల పలు రకాల రోగాలు వచ్చే ప్రమాదం ఉందని ఐసీడీఎస్ సీడీపీఓ మంగవళి తెలిపారు. శుక్రవారం పట్టణంలోని 16, 17, 20 అంగన్‌వాడీ సెంటర్లలో ఎనిమిదోవ రాష్ట్రీయ పోషణ మాసం సందర్భంగా 'బేటీ బచ్చావో-బేటీ పడావో' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులకు ఆరోగ్యకరమైన ఆహార అలవాట్లపై సూచనలు చేశారు.

ఒకసారి కాచిన నూనెను మళ్లీ వాడకూడదని హెచ్చరించారు. పిల్లలకు సెల్‌ఫోన్లు ఇవ్వడం వల్ల వారి భవిష్యత్తు దెబ్బతినే అవకాశం ఉందని చెప్పారు. అనంతరం మొక్కలను నాటారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఆశీర్వాదమ్మ, అంగన్‌వాడీ టీచర్లు యశోదమ్మ, రవణమ్మ, వెంకటమ్మ పాల్గొన్నారు.

బలవర్ధకమైన ఆహారం తీసుకోవాలి


పగిడ్యాల: కొత్త ముచ్చుమర్రి గ్రామంలో శుక్రవారం అంగన్‌వాడీ కార్యకర్త ఖుర్షీద్ ఆధ్వర్యంలో రాష్ట్రీయ పోషణ మాసోత్సవం జరిగింది. అంగన్‌వాడీ కేంద్రం నుంచి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. 'సుపోషిత్ భారత్-సక్షం భారత్'పై ప్రజల్లో అవగాహన కల్పించారు. చక్కెర, నూనెల వినియోగం తగ్గించుకోవాలని, సమతుల పోషకాహారం తీసుకోవాలని సూచించారు. గర్భిణులు, బాలింతలు బలవర్ధకమైన ఆహారం తీసుకోవాలని తెలిపారు. ర్యాలీలో గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు.



మహానందిలో శత చండీయాగంలో పాల్గొన్న భక్తులు

భక్తిశ్రద్ధలతో శతచండీయాగం

మహానంది: దసరా నవరాత్రి మహోత్సవాల సందర్భంగా మహానందిలో నిత్యం జరుగుతున్న శత చండీయాగం, రుద్రహోమం, చండీహోమాలు, నాలుగు కాలార్చన పూజలు, అలంకరణ పూజలు వైభవంగా జరుగుతున్నాయి. వేదపండితులు, రుత్వికులు, అర్చకులు ఉదయం నుంచి రాత్రి వరకు చేస్తున్న పూజల్లో ఉభయదాతలు పాల్గొన్నారు. మహానందిలో మూలమూర్తి శ్రీ కామేశ్వరీదేవి అమ్మవారు శుక్రవారం శ్రీ లలిత దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో మూలమూర్తి శ్రీ కామేశ్వరీదేవి అమ్మవారికి నిత్యం ఒక అలంకరణ చేస్తున్నారు. నవరాత్రి ఉత్సవాల్లో ఎంతో విశేషమైన బాలపూజ (ఉదయం), సువాసిని పూజ (రాత్రి) నిత్యం చేస్తున్నట్లు వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని తెలిపారు.



బుక్కాపురంలో శ్రీ మహాలక్ష్మిగా అమ్మవారు



ఓంకారంలో శ్రీ మహాలక్ష్మి దేవిగా ఉమామహేశ్వర దేవి



ఆత్మకూరు: స్కందమాత అలంకరణలో వాసవీమాత



శ్రీ కాత్యాయినీదేవి అలంకరణలో చౌడేశ్వరిదేవి



వెలుగోడులో మహాలక్ష్మి అలంకరణలో వాసవీమాత

మహాలక్ష్మీదేవిగా ఉమామహేశ్వరి దేవి



ఆత్మకూరు వాసవీమాత ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఆర్యవైశ్యులు,



బుక్కాపురంలో అలరించిన కోలాటం

దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శ్రీశైలం, నందికొట్కూరు నియోజకవర్గాల్లోని వివిధ ఆలయాలు, మండపాల్లో కొలువైన అమ్మవార్లు మహాలక్ష్మి దేవి, స్కంద మాత, కాత్యాయని దేవి, పార్వతీ మాత అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా భక్తులు, నిర్వాహకులు ప్రత్యేక పూజలు చేశారు. - సాక్షి నెట్‌వర్క్



నందికొట్కూరు: మహాలక్ష్మిగా కన్యకాపరమేశ్వరి



పాములపాడు చౌడేశ్వరీదేవి




నెహ్రూనగర్‌లో..



కొత్తపల్లి: మహాలక్ష్మీదేవిగా కొలనుభారతిదేవి



నందికొట్కూరు: మహాలక్ష్మి అలంకరణలో చౌడేశ్వరీదేవి



తాటిపాడులో..



జూపాడుబంగ్లా క్వార్టర్స్‌లో స్కందమాతగా..



పగిద్యాలలో..

ఐలమ్మ పోరాటం ఎందరికో స్ఫూర్తి



చాకలి ఐలమ్మ విగ్రహానికి నివాళులర్పిస్తున్న రజకులు

జూపాడుబంగ్లా: భూమి, భుక్తి కోసం రజాకార్లపై పోరాటం చేసి వీరవనితగా నిలిచిన చాకలి ఐలమ్మను స్ఫూర్తిగా తీసుకొని సమస్యల పరిష్కారం కోసం ప్రతి ఒక్కరూ పోరాడాలని రజక సంక్షేమ సంఘం మాజీ రాష్ట్ర నాయకుడు బస్తిపాటి మౌలాలి, మండల అధ్యక్షుడు రామాంజనేయులు పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి 130వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. రజకులను ఎస్సీ జాబితాలో చేర్చి విద్య, ఉద్యోగాల్లో ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. నీట్‌లో ప్రతిభ కనబర్చిన తంగడంచ గ్రామానికి చెందిన ఛత్రపతి శివాజీ, నందికొట్కూరుకు చెందిన జగన్నాథ్‌లను సత్కరించారు. సంఘం నాయకులు ఎర్రన్న, ప్రచార కార్యదర్శి నాగభూషణం, విశ్వనాథం, రామకృష్ణ, గోకారమయ్య, షాజహాన్ పాల్గొన్నారు.

చాకలి ఐలమ్మకు నివాళి

పాములపాడు: తెలుగు వారి వీరత్వాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన వీరనారి చాకలి ఐలమ్మ అని రజక సంఘం మండల మాజీ అధ్యక్షుడు ధర్మయ్య, అధ్యక్షుడు రామకృష్ణ అన్నారు. మండల కేంద్రంలో ఆమె జయంతి వేడుకలను నిర్వహించారు. ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. సంఘ నాయకులు లింగస్వామి, భీముడు, శివ, పాండు, తిమ్మయ్య, ప్రసాద్ పాల్గొన్నారు.

ఈఓఆర్‌డీకి సన్మానం

మహానంది: ఎంపీడీఓగా పదోన్నతి పొందిన ఈఓఆర్‌డీ నాగేంద్రుడు సేవలు ఎనలేనివని ఎంపీపీ అధ్యక్షురాలు బుడ్డారెడ్డి యశస్విని అన్నారు. ఆత్మకూరు ఎంపీడీఓగా వెళ్తున్న మహానంది ఈఓఆర్‌డీ నాగేంద్రుడిని శుక్రవారం సన్మానించారు. ఎంపీడీఓ మహబూబ్ దౌలా, సిబ్బంది పాల్గొన్నారు.

మండల మీట్ వాయిదా..

మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం జరగాల్సిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం వాయిదా వేసినట్లు ఎంపీపీ బుడ్డారెడ్డి యశస్విని తెలిపారు. ఈ నెల 29న నిర్వహించనున్నట్లు చెప్పారు.